క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హాజరవుతారని వివరించారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో సమయానికి హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రీన్ కలర్ డే



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రీన్ కలర్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్‌కలర్‌లో ఉండే కూరగాయలు, పండ్లు, ఇంట్లో ఉపయోగించుకునే వస్తువులు, ఆట పరికరాలు, ఆకులు, తదితరాలపై పిల్లలకు వివరించారు. ఆకుపచ్చ రంగులో ఉంటే వస్తువులను ప్రదర్శించారు. పిల్లలకు రంగులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జి.ధనలక్ష్మి, ఆయా సుగుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

వత్సవాయి: స్థానిక శ్రీరామ జగపతి దేవస మేత వత్సవాయమ్మ తల్లి హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కల బహిరంగవేలం కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొవచ్చన్నారు.

ఆలయంలో వింజామర మాయంపై ఫిర్యాదు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సంబంధించిన వింజామర కనిపించకపోవటంపై మంగళవారం ఆలయ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 5న అమ్మవారి కల్యాణం సందర్భంగా అమ్మవారు, స్వామివార్లకు పక్కన రెండు వెండితో చేసిన వింజామరలు ఊపుతూ సేవ చేశారు. అయితే కల్యాణం అనంతరం జరిగిన హడావిలో ఒక వింజామర కనిపించలేదు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు తెలిపారు. దీనిపై ఎస్‌ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వింజామర విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని చెబుతున్నారు.

ఆలయానికి రూ.1.77 లక్షల ఆదాయం

ముక్త్యాల(జగ్గయ్యపేట): భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయం వద్ద వివిధ అంశాలకు నిర్వహించిన వేలం ద్వారా రూ.1.77 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఇన్‌చార్జి ఈవో నాగరాజు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈ నెల 15 నుంచి జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా కొబ్బరిచిప్పలు, లడ్డులు విక్రయించేందుకు వేలం నిర్వహించారు. లడ్డు విక్రయానికి రూ.40 వేలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కును రూ.1.37 వేలకు పాటను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందిగామ: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ అధికారి విజయ కుమారి సూచించారు. మండలంలోని పెద్దవరం, చెరువు కొమ్ము పాలెం, లింగాలపాడు గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విభాగం, రైతు సాధికార సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సమస్యలకు సమాధానాలు చెప్పడంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రతిష్ఠా మహోత్సవాలు

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 10న ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్‌బాబులు తెలిపారు. ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఈ ఉత్సవాల్లో ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- పరిటాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



పరిటాలలో మహిళకు కరపత్రం అదజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: నవరత్నాల్లో పొందుపర్చిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాలలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను అభివాదం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు, గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మన బడి నాడు-నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే నన్నారు. ఇటువంటి సీఎం తిరిగి మళ్లీ అధికారంలోకి రావాలని అందరూ సీఎంను ఆశీర్వదిస్తున్నారని అన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజినీ, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, వేల్పుల రమేష్, తహసీల్దార్ వీ రాజకుమారి, ఎంపీడీఓ కే బాలశంకరరావు, ఏపీఎం కోట భాస్కరరావు, ఆర్ఐ శిరీష, పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జడ్జిలు శ్రావణి, శోభారాణి
- శిబిరాన్ని సందర్శించిన విప్ ఉదయభాను



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జిలు కె.శ్రావణి, ఎం.శోభారాణి



రోగులతో మాట్లాడుతున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.శోభారాణి పేర్కొన్నారు. గ్రామంలో న్యూ హోప్ స్కూలులో న్యూహోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే ఉచిత మెగా కంటి, దంత వైద్యశిబిరాన్ని మంగళవారం జడ్జిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో న్యూ హోప్ మినిస్ట్రీస్ గత 20 సంవత్సరాలుగా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వైద్యశిబిరాన్ని సందర్శించిరోగులతో మాట్లాడారు. మొదటిరోజు 1500 మందికి పైగా రోగులు కంటి, దంత పరీక్షలు చేయించుకున్నారు. గుంటూరు శంకర్ నేత్రాలయం, ఖమ్మం మమత మల్టీ స్పెషాలిటీ వైద్యులు, అమెరికన్ వైద్యులు రోగులను పరీక్షించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, ఎంపీడీవో జయచంద్ర, ఎస్ఐ దుర్గాప్రసాద్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, న్యూ హోప్ మినిస్ట్రీస్ ప్రభుదాస్ రూత్, కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు నంబూరి రవి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకం



నంబూరి రవి



అల్లూరి కృష్ణవేణి

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన నంబూరి రవి, అల్లూరి కృష్ణవేణి నియమితులయ్యారు. ఓసీ సామాజికవర్గం నుంచి నంబూరి రవి, ఎస్సీ సామాజిక వర్గం నుంచి అల్లూరి కృష్ణవేణిని నియమించారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను ఈ ఉన్నతమైన పదవిలో నియమించినందుకు ఎమ్మెల్యే ఉదయభానుకు ఎల్లవేళలా కృతజ్ఞులుగా ఉంటామని తెలిపారు. కులాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలకు సుముచిత స్థానాన్ని కల్పిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను నిర్ణయానికి నియోజక వర్గ వ్యాప్తంగా అన్ని సామాజిక వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నట్లు తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళకు రాష్ట్రంలో ప్రముఖమైన విజయవాడ ఇంద్రకీలాద్రి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్యే ఉదయభానుకు దక్కిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు



మాట్లాడుతున్న ఐద్వా నేత నాగామణి, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: కేంద బడ్జెట్ వలన పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగిందేమి లేదని, బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రమే అనుకూలమైన బడ్జెట్ ప్రజా సంఘాల నేతలు తెలిపారు. పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం కేంద్ర బడ్జెట్‌పై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఐద్వా నాయకులు సోమోజు నాగమణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ 2023 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చేవిగా లేవని, ఏపీకి ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్ట్, ఐఐటీ, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ వంటి వాటికి నిధులు కేటాయించడం లేదన్నారు. ఉపాధి హామీ, ఆహార సబ్సిడీ, ధాన్యం సేకరణ, వ్యవసాయం, ఎరువులు, గృహ నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లో నిధులకు కోత విధించిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం మాత్రమే తెలుసన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయకుండా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బడ్జెట్ కోతలపై ఎవరూ మాట్లాడకపోవడం దారుణమన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 9న పట్టణంలో జరిగే బడ్జెట్ ప్రతుల దహన కార్యక్రమంలో నిరసన తెలపాలని కోరారు. కాకనబోయిన లింగారావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, జుజ్జవరపు వెంకట్రావు, షేక్ మీరా సాహెబ్, బాలు, కరీమా, బూషమ్మ, నాగరాణి, విజయలక్ష్మి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీరివ్వని తెలంగాణ ప్రభుత్వం

మైలవరం: నాగార్జున సాగర్ ఎడమ కాలువ 117వ కిలోమీటర్ వద్ద నుంచి 1800 క్యూసెక్కుల సాగర్ నీరు రావాల్సి ఉండగా తెలంగాణ ప్రభుత్వం గత మూడు నెలలుగా సక్రమంగా నీరు ఇవ్వకుండా ఆంధ్ర ప్రాంత రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ళ రఘునాథరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మైలవరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోని కల్లూరు మేజర్ నుంచి అప్పుడప్పుడూ కొద్దిపాటి నీరు మాత్రమే విడుదల చేయడంతో ఈ ఏడాది మైలవరం పరిసర ప్రాంతాల్లో దాళ్వా సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పక్క రాష్ట్రానికి రావాల్సిన వాటా నీటిని కూడా విడుదల చేయని కేసీఆర్ బీఆర్ఎస్ స్థాపించి దేశాన్ని ఉద్ధరిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో బీజేపీ మైలవరం మండల అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, నాయకులు జె.శేఖర్, నరేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మైలవరం ఎస్ఐ



మైలవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మైలవరం ఎస్ఐ రాంబాబు మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం నుంచి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై విజయవాడలోని కృష్ణలంక వెళుతున్న ఇద్దరు యువకులు మైలవరం మండలం చంద్రగూడెం వద్ద డివైడర్‌ను ఢీకొని ప్రమాద స్థితిలో రోడ్డుపై పడి ఉన్నారు. అదే సమయంలో మైలవరం మండలం బొర్రగూడెం వద్ద బందోబస్తు నిమిత్తం డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.
గాయపడిన ఇద్దరు యువకులను తన వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించి, ప్రాణాపాయ స్థితి నుంచి వారిని కాపాడారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో మొత్తం 9 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు పదవ తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాలు లోపు ఉన్న వారు గ్రామ, వార్డ్ సచివాలయ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17వ తేదీ వరకు అవకాశ ముందన్నారు.

కంపచెట్ల తొలగింపు



చెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచి జ్యోతి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం తెలిపారు. మంగళవారం తమ సొంత నిధులతో శ్మశాన వాటికలో జేసీబీ సాయంతో కంపచెట్ల తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో వాగుపై కల్వర్టు ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సహకారంతో కృషి చేస్తామన్నారు. స్థానిక నాయకులు దోసపాటి దానయ్య, చింతల నిర్మలరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం మొక్కల చోరీ

మునుగూరు: పదేళ్లుగా పెంచుతున్న శ్రీగంధం మొక్కలను దుండగులు అర్ధరాత్రి నరికి అపహరించుకుపోయిన ఘటన మండలంలోని కాట్రేనిపాడులో జరిగింది. మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన కొండెపాటి వెంకటసుబ్బారావు తన రెండెకరాల పొలంలో పదేళ్ల క్రితం ఆయిల్ పామ్ మొక్కలతో పాటు యాభై సెంట్లలో శ్రీగంధం మొక్కలు నాటాడు. గ్రామంలో ఇటీవల జరిగిన జంట హత్యల నేపథ్యంలో పొలం వైపునకు రైతు రాకపోవడంతో ఇదే అదునుగా సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు 30 శ్రీగంధం మొక్కలను సగానికి నరికి పాడు చేసి, 27 మొక్కలను పూర్తిగా నరికి అపహరించుకు పోయారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గోసవీడు(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు డిపోకు చెందిన బస్సుకు మంగళవారం ప్రమాదం తృటిలో తప్పింది. సేకరించిన సమాచారం ప్రకారం ఇలా ఉన్నాయి. తిరువూరు నుంచి కంచికచర్ల మీదుగా విజయవాడ వెళ్లిన ఆర్టీసీ బస్సు తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైంది. గంపలగూడెం మండల గోసవీడు దాటిన తర్వాత బస్ అదుపు తప్పి పక్కకు దూసుకువెళ్లింది. బస్సు స్టీరింగ్ రాడ్ వదిలేయడంతో కంట్రోల్ తప్పింది. డ్రైవర్ ఎస్‌వీఆర్ బాబు చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా బస్సును అదుపు చేసి నిలిపివేసినట్లు తెలిపారు. లేని పక్షంలో బస్సు పల్టీలు కొట్టేదని ప్రయాణికులు ఈ సందర్భంగా వివరించారు.

అమ్మవారికి పొంగళ్ల నివేదన



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మూడోరోజు మంగళవారం అంకమ్మ క్రతువుల్లో భాగంగా శాలివాహనులు ఉదయం పొంగళ్లు చేసి అమ్మవారికి, సహదేవతలకు నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి, పాలు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆచారం ప్రకారం జలబిందెలు మోసినవారు ఇత్తడి తాంబూలాల్లో మూడు ఒత్తులు వెలిగించి ప్రధాన ఆలయంతో పాటు సహదేవతామూర్తుల ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం బయనీడి వారితో ఒగ్గుకథ చెప్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

పెనుగంచిప్రోలు: ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీబ్రాహ్మణులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి గొప్ప అవకాశం కల్పించారని ఏపీ దేవాలయాల తలనీలాలు తీయు వర్కర్స్ సొసైటీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ఇవ్వడంతో మంగళవారం స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద కేశఖండనశాలలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో తమకు ఇచ్చిన మాట ప్రకారం ట్రస్ట్ బోర్డు నియామకాల్లో తమకు అవకాశం కల్పించారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు తమ గురించి పరుషంగా మాట్లాడి అవమానించారని, కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీ వర్గానికి చెందిన తమకు ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు అనేక పదవులు ఇచ్చారన్నారు. క్షురకులుగా దుకాణాలు నిర్వహించుకునే వారికి ఏడాదికి రూ.10 వేలు ఇస్తూ వారికి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆలయాల్లో పనిచేస్తున్న తలనీలాలు తీయు నాయీబ్రాహ్మణ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కూడా ముఖ్యమంత్రి కల్పిస్తారని నమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘనాయకులు కొలిపాక రాము, కృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరావు, ఉప్పు నరసింహారావు, ఏలూరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రాఘవేంద్ర, పాండురంగారావు

జగ్గయ్యపేట అర్బన్: త్వరలోనే స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కోచ్ పాండురంగారావు మర్యాదపూర్వకంగా కలిశారు. శాప్ ఆధీనంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పేట పురపాలక సంఘానికి అందజేయాలని, తద్వారా జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు స్విమ్మింగ్ పూల్‌ను అందించి ప్రమాదాలను అరికట్టడంలో తోడ్పాటు నివ్వాలని కోరుతూ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే స్విమ్మింగ్ పూల్‌ను మున్సిపాలిటీకి అప్పగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కమిషనర్ జయరాం



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో చురుగ్గా వ్యవహరించాలని కమిషనర్ జయరాం సూచించారు. పట్టణంలోని 9వ సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని రికార్డులు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని,సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పారిశుద్ధ్య మెరుగుపరిచేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. పట్టణంలోని 2వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరచేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలి



తరగతి గదులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులను సమగ్రశిక్షాభియాన్ జిల్లా ఏఎంఓ బీ సురేష్ మంగళవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ మేరకు ఏఎంఓ మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. పనులు పూర్తవగానే బిల్లులు సకాలంలో ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన టాబ్‌లను పరిశీలించారు. ఏపీఓం కోట భాస్కరరావు, హెచ్‌ఎం కేకేవీ శర్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మనబడి నాడు-నేడు పథకం కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను మంగళవారం ఎస్ఎస్ఏ అకడమిక్ మానటరింగ్ అధికారి బీ సురేష్, కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి టి.రాంబాబులు పరిశీలించారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం కె.జలజ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ భూముల పరిశీలన



మైనింగ్ భూములను పరిశీలిస్తున్న జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని హేమాద్రి సిమెంట్స్ మైనింగ్ భూములను ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిమెంట్ యాజమాన్యం ప్రభుత్వం కేటాయించిన సర్వే నంబర్లలో కాకుండా మరో భూములు మైనింగ్ గనులు యథేచ్ఛగా తవ్వుతున్నట్లు ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించాడు. దీంతో భూములను పరిశీలించామన్నారు. సర్వేయర్లు, మైనింగ్ అధికారులు మరోసారి భూములను సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. అనంతరం ఆమె మండలంలోని బండిపాలెం గ్రామంలో గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ రామచంద్రరావు, తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ సంతోష్, వీఆర్వో బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.